క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా 12న నిర్వహించే బూత్ అధ్యక్షుల సమ్మేళనం, సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్‌షా పాల్గొని మార్గదర్శనం చేయనున్నారని, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు గడపగడపకు తెలియజేస్తూ సోషల్ మీడియాలో కార్యకర్తలు చురుకుగా ఉండాలన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మాడుగుల ప్రవీణ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహరాజు, మాసాడి ముత్యంరావు, కౌన్సిలర్ పైళ్ల వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాజీ ఉపసర్పంచ్‌పై దాడి హేయమైన చర్య

వీణవంక: మండలంలోని నర్సింహులపల్లి మాజీ ఉపసర్పంచ్ విజేందర్‌పై కాంగ్రెస్ నాయకుల దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సాయంత్రం విజేందర్‌ను పరామర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అండా చూసుకొని కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తున్నారని, దాడులను సహించమని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ప్రజలను మోసం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంగ స్వరూపసమ్మయ్య, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

గ్రామానికి చెందిన అలుగువెల్లి కవిత, ఆమె భర్త కోమాల్‌రెడ్డితో పాటు కూతురు అకారణంగా కర్రతో దాడి చేశారని విజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విజేందర్ అకారణంగా బూతులు తిడుతూ జుట్టు పట్టి కింద పడేసి కొట్టాడని కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: జిల్లా కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో రాష్ట్ర పోలీస్ అధికారులు, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీస్ ఎస్కార్ట్ వాహనాల్లో తిరిగి ప్రభుత్వం మారిన తర్వాత పోలీసులను దుర్భాషలాడడం సరైన పద్ధతి కాదన్నారు. కౌశిక్‌రెడ్డి రాజకీయ అలజడి కోసం ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అనేక మందిపై అక్రమ కేసులు పెట్టించిన చరిత్ర నీదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పార్టీ నాయకులు, కార్యకర్తలపై వేధింపులకు పాల్పడలేదన్నారు. మంత్రులు, నాయకులపై అవాకులు చెవాకులు, చిల్లర మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్, లారీ పట్టివేత

జమ్మికుంట: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్, అధిక లోడ్‌తో ఇసుకను తరలిస్తున్న లారీని శనివారం పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. మానేరు పరీవాహక ప్రాంతం వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా తనుగుల గ్రామానికి చెందిన జైద రామకృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ముత్తారం నుంచి అధిక లోడ్‌తో ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసి చర్యల కోసం మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

రైతులకు పంటనష్ట పరిహారం ఇవ్వాలి



చొప్పదండి: గతేడాది వడగండ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గుమ్లాపూర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.పదివేల పరిహారం అందిస్తామని ప్రకటించి సర్వేలు చేసి చేతులు దులుపుకుందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ విమర్శలు చేసుకుంటూ రైతుల నడ్డీ విరుస్తున్నాయని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హామీని నెరవేర్చేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఏ రాజ్యాంగం అడ్డు వస్తోందని ప్రశ్నించారు. షరతులు లేకుండా రైతులకు పరిహారం అందజేయాలని జేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, విలాసాగరం అంజయ్య, బద్దెనపల్లి రాజేందర్, శ్రీని వాస్, ప్రశాంత్, మహేశ్, సంతోశ్, సత్యనారా యణరెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ | ఇంకెన్నాళ్లకు పూర్తి..?

- చివరిదశలో నిలిచిన నిర్మాణ పనులు
- అంచనా వ్యయం రూ. 2 కోట్లు
- రోడ్డుపైనే వెజ్, నాన్‌వెజ్ దుకాణాలను నిర్వహిస్తున్న వైనం



మార్కెట్ లోపల అసంపూర్తి పనులు(ఇన్‌సెట్లో) ఇంటిగ్రేటెడ్ మార్కెట్ షెడ్డు

చొప్పదండి: పట్టణ ప్రజలకు అందుబాటులో ఒకే చోట కూరగాయలు, నాన్‌వెజ్ లభించేలా నిర్మించిన సమీకృత మార్కెట్ ప్రారంభోత్సవానికి గ్రహణం పట్టుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మార్కెట్ నిర్మాణ పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి కావడానికి నెలలు గడుస్తున్నాయి. పట్టణంలో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న కూరగాయల దుకాణాలు, మటన్ మార్కెట్‌ను వ్యవసాయ మార్కెట్ యార్డులో కేటాయించిన రెండెకరాల స్థలంలోకి తరలించేందుకు రెండేళ్ల క్రితం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ యార్డును కుదిస్తున్నారని రైతుల నుంచి విమర్శలు వచ్చినా నిర్మాణం మొదలుపెట్టి చివరి దశలో పనులు నిలిపివేశారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో రూ.కోట్లు కేటాయించి చేపట్టిన పనులకు ప్రయోజనం లేకుండా పోయింది.

నిధులు విడుదల లేకనే..

పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు కూరగాయలు, నాన్‌వెజ్ ఒకే చోట లభించేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. రోడ్డుపై ప్రయాణికులకు గండంగా మారిన దుకాణాల సముదాయాలన్నీ ఒకేచోట చేర్చడం దీని ఉద్దేశం. రూ. రెండు కోట్లతో చేపట్టిన పనులను సరిగ్గా రెండేళ్ల క్రితం ప్రారంభించారు. ఆరునెలల్లో పూర్తి చేసి మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అధికారులు చేతులెత్తేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక పోవడంతోనే పనులు నిలిపివేశారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. విమర్శల మధ్య మొదలైన పనులు మధ్యలోనే ఆగిపోవడం, ప్రభుత్వ ఆశయం నెరవేరక పోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డుపైనే అమ్మకాలు

పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు డివైడర్ నిర్మించారు. బీటీ రోడ్డు విస్తరించకుండానే, అధికారులు నిబంధనలను విస్మరించి కాంట్రాక్టర్‌లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా పనులు చేశారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరించకపోవడంతో వీధి వ్యాపారులు ఇప్పుడు వందఫీట్ల రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇంటిగ్రేటడ్ మార్కెట్ అందుబాటులోకి వస్తే రోడ్డుపై వీధి వ్యాపారులను ఖాళీ చేయించే అవకాశం ఉండేది. చివరిదశలో ఉన్న పనులు పూర్తి చేయకపోవడంతో రోడ్డుపై దుకాణాల నిర్వహణతో ట్రాఫిక్‌కు సమస్య ఏర్పడుతోంది. వ్యాపారాలు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌పై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ వివరాలు

అంచనా వ్యయం	రూ. 2 కోట్లు
వెజిటేబుల్ విక్రయ గదులు	60
నాన్‌వెజ్ విక్రయ గదులు	60
కేటాయించిన స్థల విస్తీర్ణం	2 ఎకరాలు
పనులు ప్రారంభం	మార్చి 2022
పూర్తి చేయాల్సింది	అక్టోబర్ 2022

పనులు పూర్తి చేయిస్తాం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. షెడ్డు నిర్మాణం పూర్తయింది. షెడ్డు లోపల టైల్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు పూర్తి స్థాయిలో మంజూరు కాగానే పనులు పూర్తి చేయిస్తాం. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి.

– ప్రశాంత్‌కుమార్, మున్సిపల్ మేనేజర్, చొప్పదండి

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



తిమ్మాపూర్: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



మానకొండూర్: రంగపేటలో..



అన్నదానంలో దావు సంపత్‌రెడ్డి, తదితరులు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ శ్రీగంగా భవానీశంకర ఆలయంలో మహాశివారాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ఉరుమండ్ల కిరణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం దావు సంపత్‌రెడ్డి, సిరికొండ అంజన్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ కోడం కనకయ్య, ఆలయ కమిటీ చైర్మన్ గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మీసాల అంజయ్య, నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ప్రణీత్‌రెడ్డి, సుగుర్తి జగదీశ్వరాచారి, గుజ్జుల తిరుపతిరెడ్డి, మాచర్ల అనిల్, శ్రీనివాస్, గోగూరి నర్సింహారెడ్డి, భుదారపు శ్రీనివాస్, భక్తులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రంగపేటలో మల్లికార్జునస్వామి కల్యాణం

మానకొండూర్: మండలంలోని రంగపేట గ్రామంలో మల్లికార్జునస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పుట్ట బంగారం సేకరణ, హోమం నిర్వహించారు. శనివారం ఒగ్గు పూజారులు పట్నాలు వేసి మల్లికార్జున స్వామి కల్యాణం జరిపించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం భక్తులు బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానం

గన్నేరువరం: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలవ్వాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌లో శ్రీనాథ్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. అలాగే అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రక్తదాన చేసిన యువజన సభ్యులు, ఇతరులకు శ్రీనాథ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యూత్ నాయకులు సాయిదీప్‌రావు, వైద్యబృందం, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



వీణవంకలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్ జీ



గన్నేరువరంలో సీఐఎస్ఎఫ్, పోలీసుల కవాతు

వీణవంక: ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టొదని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ అన్నారు. మండలంలోని చల్లూరు, వీణవంక గ్రామాలలో శనివారం సాయంత్రం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించిమాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. అనుమానితులు సంచరిస్తే డయల్ 100కి సమాచారమివ్వాలన్నారు. జమ్మికుంట టౌన్ సీఐ రవి, వీణవంక ఎస్సై తిరుపతి పోలీసులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

గన్నేరువరం: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తిమ్మాపూర్ సీఐ స్వామి అన్నారు. సీపీ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు మండలకేంద్రంలో 40 మంది సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీంలతో శనివారం కవాత్ నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని తెలిపారు. ఓటు వజ్రాయుధమని, దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ విక్రాంత్, ఎస్సై నరేశ్, ప్రజలు పాల్గొన్నారు.

గురుకులంలో నారీ శక్తి ఫిట్‌నెస్ రన్



గన్నేరువరంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

చొప్పదండి: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని గురుకుల విద్యాలయంలో నారి శక్తి ఫిట్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాలుగవ వార్డు కౌన్సిలర్ చేపూరి హేమ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం శక్తిమంతమవుతుందన్నారు. అనంతరం రన్నింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ స్వాతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండలకేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం నారీ శక్తి ఫిట్‌నెస్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. యువ చైతన్య యూత్ క్లబ్ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో ముందుడాలని, స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగం, వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయి ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు లలిత, అనూష, మనీషా, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: నెహ్రూ యువకేంద్రం కరీంనగర్, శివరుద్ర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాములపల్లి యువజన సంఘం అధ్యక్షుడు గుత్తికొండ పవన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామపంచాయతీ కారోబారు తిప్పారపు వీరన్న, ఫీల్డ్ అసిస్టెంట్ మేకల పుల్లమ్మ హాజరయ్యారు. మహిళలందరూ కలిసి పుల్లమ్మను సత్కరించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. మహిళలు ధైర్యంగా అన్నిరంగాల్లో ముందుకెళ్తూ మార్గదర్శనం కావాలని కోరారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు విజయ్, సంతోష్, వంశీ, శ్రీనివాస్, రాకేశ్, ఆసిఫ్, యువజన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



ఇల్లందకుంట: పుల్లమ్మను సత్కరిస్తున్న మహిళలు



చొప్పదండి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పంటలకు సాగునీరు విడుదల



గన్నేరువవరం: గన్నేరువరం శివారులోని మారెల్లకుంటలో సాగునీరు లేక పొలాలు ఎండుతున్నాయని, కాల్వ తవ్వకం చేపట్టి సాగునీరు అందించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు సమస్యను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్‌శాఖ అధికారులతో మాట్లాడారు. శనివారం ఏఈ మహేందర్ మిడ్‌మానేరు ప్రాజెక్టు కింద ఉన్న ఉప కాల్వ 8కి అనుసంధానంగా మైనర్ కాల్వ నుంచి జేసీబీతో కాల్వ తవ్వకం చేపట్టి పంటలకు సాగునీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా రైతులు ఎమ్మెల్యే, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గత ంలో కాల్వ తవ్వకానికి కొందరు రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సంబంధిత పనులు నిలి చి పోయాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేటినుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఎల్ఎండీ వేంకటేశ్వరస్వామి ఆలయం

తిమ్మాపూర్: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు.. కలియుగ దైవంగా విరజిల్లుతున్న తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని శ్రీఆండాళ్, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 40 ఏళ్లుగా వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండగా.. మార్చి 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే వేడుకలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. బ్రహ్మోత్సవాలకు స్థానికులతోపాటు కరీంనగర్, చుట్టుపక్కల మండలాల నుంచి భారీగా భక్తులు హాజరవుతారు. సుమారు 51 ఏళ్ల(1973లో) క్రితం లోయర్ మానేరు డ్యాం నిర్మాణ సమయంలో స్వామివారు వెలిశారని చెబుతుంటారు. డ్యాం నిర్మాణ సమయంలో అధికారుల కోసం క్వార్టర్ల నిర్మాణ పనుల్లో భాగంగా చేపట్టిన తవ్వకాల్లో స్వామివారి విగ్రహం బయటపడింది. అంతకు ముందు ఓ భక్తుడికి స్వామివారు కలలో కనిపించి తాను స్థానికంగానే ఉంటున్నానని చెప్పడం, అంతలోనే తవ్వకాల్లో స్వామివారి విగ్రహం బయటపడడంతో భక్తుడు కల నిజమైందని భావించాడు. వెంటనే స్థానికులు, అధికారులకు స్వామివారి మహత్యం వివరించగా భక్తుడి ఆధ్వర్యంలోనే స్వామివారికి చిన్నషెడ్డు నిర్మించి నిత్యం పూజలు చేశారు. తర్వాత స్థానిక భక్తులు స్వామివారి మహత్యం తెలుసుకొని ఆలయ నిర్మాణానికి ముందుకు రావడంతో 1979లో గుడి నిర్మించారు. ఆండాళ్, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలను పెద్దజీయర్ స్వామివారు స్వయంగా ప్రతిష్ఠించారు. ఈ వేడుకలను స్వామీజి స్వయంగా నిర్వహించారు. నాటి నుంచి ఏటా పండుగలు, ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు, ఫాల్గుణ మాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మానేరు తీరంలో సువిశాల విస్తీర్ణంలో కొండపై కొలువై ఉన్న స్వామివారి ఆలయంలో జరగనున్న 45వ వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీగా తరలివస్తారని నిర్వాహకుల అంచనా.

అధిక సంఖ్యలో హాజరు కావాలి



ఆండాళ్ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి మహత్యంతో వేలాది భక్తులు బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. పండుగల సమయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నాం. ఈసారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహిస్తాం. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలి.ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు అధ్యయనోత్సవాల ప్రారంభమవుతాయి.

– గోవర్ధన వెంకటాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు

అంబులెన్స్ సేవలు ప్రారంభం



అంబులెన్స్ సేవలను ప్రారంభిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన అంబులెన్స్‌ను శనివారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎడవెల్లి కరుణశ్రీ, మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్నలతో పాటుగా వైద్యాధికారులు, సిబ్బంది, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కదనభేరికి తరలిరావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ నివాసంలో శనివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై మాట్లాడారు. 12న కరీంనగర్‌లో నిర్వహించే బీఆర్ఎస్ కదనభేరి సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు మండలం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు తరలిరావాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ పాలనపై సోషల్ మీడియా వారియర్స్ విమర్శలు గుప్పించాలన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక్క అవకాశం అంటూ సానుభూతితో గెలుపొందారని, కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయని ప్రభుత్వం బీఆర్ఎస్‌ను విమర్శిసస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, రాజయ్య, అశోక్‌రెడ్డి, కొమురయ్య, అనిల్ గౌడ్, వెంకట్ రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

హోంశాఖ కేటాయించాలి

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ హోంశాఖను ఎవరికీ కేటాయించలేదని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా, శాంతిభద్రతల పర్యవేక్షణకు హోంశాఖ మంత్రి ఉండాలిని కోరారు.

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను హన్మకొండలో ఆయన స్వగృహంలో పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కసుబోజుల వెంకన్న, సుంకరి రమేశ్, ఎండీ సలీం, యగ్గని శ్రీనివాస్, చిన్నింటి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు గొడిశాల శేఖరయ్య తాటిచెట్టు పైనుంచి కిందపడటంతో గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వృత్తిలో భాగంగా శేఖరయ్యతాటి శనివారం చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకు జారడంతో కిందపడిపోయాడు. తల, కాళ్లకు గాయాలు కాగా తోటి గీత కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సామాజిక సర్వే



మాట్లాడుతున్న రాజేశ్వరావు

మానకొండూర్: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజసేవలో పాల్గొంటూనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి రాజేశ్వరావు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత కళింగ శేఖర్ అన్నారు. మండలంలోని రంగపేట, అన్నారం గ్రామాలలో వాగేశ్వరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించగా వలంటీర్లు గ్రామాల్లో సామాజిక సర్వే చేపట్టారు. ఈసందర్భంగామాట్లాడారు. వలంటీర్లు క్రమశిక్షణతో మెలగాలని, అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఎలా కష్టపడాలో తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, అధ్యాపకులు లింగారావు, సత్యనారాయణ, మాలతి, సునీత, అరుణ్, అనిల్, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.